క్లుప్తంగా

13న ఫిట్టర్స్‌కు జాబ్‌మేళా

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్ ట్రేడులో ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 13వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఏజీఐ గ్రీన్‌ప్యాక్, ఏజీఐ గ్లాస్ ప్యాక్ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఫిట్టర్ ఉత్తీర్ణులైన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు.

వాసవీ శాంతి థాంలో హోమం



పెనుగొండ వాసవీ శాంతి థాంలో హోమం నిర్వహిస్తున్న కర్ణాటక భక్తులు

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో కర్ణాటక భక్తులు హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి ఆలయంలో ఉదయం నుంచి కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన వాసవీ భక్తులు అమ్మవారికి పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం మరకత శిల వాసవీ మాతకు అభిషేకంలు నిర్వహించారు. వాసవీ హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

ప్రతి ఇంటిపై కాషాయ జెండా



దొడ్డిపట్లలో కాషాయ జెండాలు పంచుతున్న భజరంగ్ దళ్ కార్యకర్తలు

యలమంచిలి: హిందువులంతా తమ ఇళ్లపై కాషాయ జెండాలు ఎగుర వేయాలని భజరంగ్ దళ్ కార్యకర్తలు కోరారు. దొడ్డిపట్లలోని విజయసారథి కాలనీలో భజరంగ్‌దళ్ కార్యకర్తలు సోమవారం ప్రతి ఇంటికీ కాషాయ జెండా పంచారు. ఈ సందర్భంగా గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు. చిన్నారులతో భగవద్గీత శ్లోకాల ఆలపన చేయించి బహుమతులు అందజేశారు. భజరంగ్‌దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల చంటి, మండల అధ్యక్షుడు దివి ప్రకాష్, ఉపాధ్యక్షుడు వినుకొండ శివ కార్యకర్తలు గుబ్బల బాబ్జి, డి జగదీష్, గండికోట సుబ్బయ్య, చెరుకూరి శేషగిరి, విజయసారథి కాలనీ వాసులు శేరు నాగబాబు, కామాడి శ్రీను, పెరికిపాలెం శ్రీను పాల్గొన్నారు.

వ్యక్తుల ప్రవర్తనలో మార్పులు గమనించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ భారతి

పాలకొల్లు సెంట్రల్: కొన్ని సంఘటనలతో కుంగుబాటుకు గురైన వారు సహనాన్ని కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతుంటారని ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ చల్లా భారతి తెలిపారు. ఆదివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక కోడిగట్టు వద్ద ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భారతి మాట్లాడుతూ ఆత్మహత్యలు చేసుకునే వారి ప్రవర్తనలో మార్పులను గుర్తించి సైక్రియాటిస్ట్‌ల సలహాలు తీసుకోవాలన్నారు. వారి సూచనల మేరకు మందులు వాడడంతో ఆత్మహత్యలు చేసుకోవాలనుకునే వారి ప్రవర్తనలో మార్పులు తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చల్లా బ్రిజ్ మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

అత్తిలి: అత్తిలి ఎంపీడీఓ ఎండీ ఆమీలుజమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై అత్తిలి ఎంపీడీవోగా విధులలో చేరారు. మండల పరిషత్ కార్యాలయం ఏఓ రామారావు, ఈవోఆర్డీ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది ఎంపీడీఓకు అభినందనలు తెలిపారు.

దుర్గమ్మ ట్రస్టు బోర్డు సభ్యుడిగా వెంకట్రాజు

పెంటపాడు: విజయవాడ కనకదుర్గమ్మ ఆశీస్సులతో ట్రస్టు సభ్యునిగా కోసూరి వెంకట్రాజు అమ్మవారికి ఇతోధిక సేవలు అందించాలని ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. విప్పర్రుకు చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు కోసూరి వెంకట్రాజు సోమవారం విజయవాడ ఇంద్రకీలాద్రిలో అమ్మవారి ట్రస్టు సభ్యునిగా పదవీ బాధ్యతలు స్వీకరించి, సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. అక్కడే అమ్మవారి సన్నిధిలో ఉన్న మంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసారు. తనకు ఈ పదవి ఇచ్చి గౌరవించిన మంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆంగ్ల బోధన

చిన్నారుల్లో సృజనాత్మకత పెంపునకు కృషి



రాయలంలో ఆటలతో విద్యాబోధన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ మహాలక్ష్మి



చిన్నారులకు సృజనాత్మకతతో విద్యాబోధన చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: బాల్యం ఎంతో అమూల్యమైంది. పసిప్రాయంలో వేసే అడుగులే భవితకు పునాది. అందుకే చిన్నారుల సంరక్షణ, విద్యపై ఆసక్తి కలిగించేందుకు అంగన్‌వాడీకేంద్రాల ద్వారా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. గత ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం మాత్రమే అందించేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే అంగన్‌వాడీకేంద్రాలను ప్రీ స్కూళ్లగా మార్పుచేసి చిరుప్రాయంలోనే విద్యపై ఆసక్తి ఉండే విధంగా ఆట పాటలు, బొమ్మలు, రంగులతో అంగన్‌వాడీ టీచర్లు బోధన చేస్తున్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక సిలబస్ రూపొందించి చిన్నారుల విద్యకు అవసరమైన కిట్లను ప్రభుత్వం సమకూర్చింది. చిన్నారులకు ఆంగ్ల బోధన అందించేందుకు అనువుగా తీర్చిదిద్దింది. అందుకు అనుగుణంగా అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. ఈ నూతన విధానంలో వివిధ రకాల బొమ్మలు, ఆట పాటలతో బోధన సాగిస్తోంది. ఆసక్తికరమైన బోధనా పుస్తకాలతో చిన్నారులకు అర్థమయ్యేలా విద్యా బుద్ధులు నేర్పుతున్నారు. ఇక్కడ ఆంగ్లం నేర్చుకోవడం, పలకడం, అంకెల గురించి చెబుతున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ వర్క్ బుక్‌లో ఏ అక్షరం నుంచి జెడ్ అక్షరం వరకు పరిచయం ఉంటుంది. గణితం వర్క్‌బుక్‌లో 1 నుంచి 10 అంకెలు పరిచయం యాక్టివిటీ బుక్‌లో బొమ్మలు గీయడం, రంగులు వేయడం వంటి అంశాలు ఉంటాయి.

భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో..

భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వీరవాసరం మండలంలో 74, భీమవరం అర్బన్‌లో 31, భీమవరం రూరల్‌లో 87 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ సెంటర్లలో 1128 గర్భిణులు, 1065 బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల వయస్సు గల చిన్నారులు 5,546 ఉండగా వీరిలో మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సు గలవారు ప్రీ స్కూల్ పిల్లలు 2,201 మంది ఉన్నారు. వీటన్నింటిని ప్రీ ప్రైమరీ స్కూళ్లగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంలో చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంచే విధంగా విద్యాబోధన చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ స్కూళ్లలో రెండు తరగతులుగా బోధనలుంటాయి. ప్రీ ప్రైమరీ-1లో మూడేళ్లు నిండిన చిన్నారులకు, ప్రీ ప్రైమరీ-2లో నాలుగేళ్లు నిండిన పిల్లలకు విద్యాబోధన చేస్తున్నారు

సృజనాత్మకత పెరుగుతుంది



ప్రీ ప్రైమరీ స్కూళ్లగా అప్‌గ్రేడయిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సృజనాత్మకత పెంచే విధంగా బోధన అందిస్తున్నాం. ఇంగ్లిష్, లెక్కల్లో చిన్ననాటి నుంచే అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాం. ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా బోధన సాగించి రేపటి భవిష్యత్తుకు పునాది వేస్తున్నాం. – టీకేవీ లక్ష్మీ కాంతం, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, భీమవరం

ప్రైవేటుకు దీటుగా బోధన



ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ స్కూళ్లలో ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా బోధన అందుతుంది. చిన్నతనం నుంచే చిన్నారుల్లో చదువుపై ఆసక్తి కలిగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తద్వారా వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు.
– చినిమిల్లి నాగ శ్రీ లక్ష్మి, విద్యార్థి తల్లి, రాయలం

గ్లోబల్ ఇంజినీర్స్‌గా మారాలి



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో మురళీకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఇంజినీరింగ్ విద్యార్థులు గ్లోబల్ ఇంజినీర్స్‌గా తయారైనప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని కాకినాడ జేఎన్‌టీయూ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీ కృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటుచేసిన ఓరియంటేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువు విజ్ఞానం పెంపొందించుకోవడమే లక్ష్యంగా సాగాలన్నారు. సెల్ ఫోన్స్ వంటి ఇతర మాధ్యమాలను విజ్ఞాన సముపార్జనకు ఉపయోగించాలే తప్ప ఇతర అవసరాలకు ఉపయోగించుకుంటే విద్యార్థి జీవితం అంధకారమవుతుందని హెచ్చరించారు. కుల, మత, ప్రాంతీయ తత్వం వంటి అవలక్షణాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఎన్నో వసతులు ఉన్నాయని చెప్పారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వీవీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణను కళాశాల తరపున సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీసు యాక్ట్ అమలు



ఆకివీడు రైల్వే స్టేషన్‌లో బంద్ ప్రభావంపై అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం / ఆకివీడు: జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్, 144 సెకండ్ సీఆర్‌పీసీ అమలులో ఉందని ఎస్పీ యు.రవిప్రకాష్ సోమవారం తెలిపారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు రిమాండ్ నేపథ్యంలో నిరసనలు, ధర్నాలు, బంద్‌కు అనుమతి లేదన్నారు. బంద్ పేరుతో విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలను బలవంతంగా మూయించినా, నిబంధనలు ఉల్లంఘించి రోడ్ల పైకొచ్చి అల్లర్లు చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. టీడీపీ, జనసేన నాయకులు బంద్‌కు పిలుపునివ్వగా ఆకివీడు రైల్వే స్టేషన్ ప్రాంతం, బస్ స్టాండ్, ప్రధాన రహదారి ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఉండి నియోజకవర్గంలో ఏవిధమైన అవాంఛనీయ ఘటనలూ జరగలేదని ఎస్పీ చెప్పారు. డీఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై నాగబాబు బందోబస్తు నిర్వహించారు. టీడీపీ కార్యాలయం వద్ద, ప్రధాన సెంటర్లలో పోలీస్ పికెట్‌లు నిర్వహించారు.

బంద్ విఫలం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో సోమవారం టీడీపీ నాయకులు బంద్‌కు పిలుపునిచ్చినా దుకాణాలు, షాపులు, ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగా పనిచేశాయి. ఆర్టీసీ బస్‌లు తిరిగాయి. మండలంలో టీడీపీ నాయకులు కొన్ని చోట్ల పలు దుకాణాలు మూయించారు. నాయకులు వెళ్లిన వెంటనే దుకాణాలను యజమానులు తెరిచి వ్యాపారాలు సాగించారు.

స్పందన కరువు

ఉండి: టీడీపీ, జనసేన చేపట్టిన బంద్‌కు ఉండిలో స్పందన కరువైంది. సోమవారం ఉదయం టీడీపీ నాయకుల కోరికమేరకు కొద్దిసేపు దుకాణాలు మూసివేశారు. టీడీపీ నాయకులు కొంతసేపు అటూ ఇటూ తిరిగి వారుకూడా ఇళ్లకు వెళ్లిపోయారు. 11.30 గంటల సమయంలో యథావిధిగా దుకాణాలు తెరిచేశారు. ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి. బంద్‌లో జనసేన నాయకులెవ్వరూ పాల్గోలేదు.

వాహనం ఢీకొని ఆవు మృతి



జాతీయరహదారిపై మృతి చెందిన ఆవు

ఆకివీడు: స్థానిక కార్పొరేషన్ బ్యాంక్ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆదివారం రాత్రి ఆవు మృతి చెందింది. ఆవుకు సంబంధించిన వ్యక్తులు ఎవరూ ముందుకు రాకపోవడంతో నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు జేసీబీలోకి ఎక్కించి, స్మశాన వాటికలో ఆవును పూడ్చిపెట్టారు. హైవేపై ఆవుల్ని వదిలివేయడంతో వేగంగా వస్తున్న వాహనాలు అదుపుతప్పి ఢీకొడుతున్నాయి. పలు పశువులు ఈ విధంగా గాయపడి, మరణించిన ఘటనలున్నాయి. ఇటీవల గుమ్ములూరు సెంటర్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆవు చనిపోయింది. దీనిపై భీమవరం జడ్జి స్పందించి సుమోటోగా కేసు నమోదు చేయించారు. ఆవుల్ని, ఆబోతుల్ని రోడ్లపైకి రానివ్వకుండా నగర పంచాయతీ చర్యలు తీసుకోవాలని, వాటికి సంరక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన కృష్ణమందిర 66వ వార్షికోత్సవాలు



పేద విద్యార్థులకు నగదు అందిస్తున్న పెదకృష్ణం రాజు

పెంటపాడు: అలంపురం గ్రామంలో కృష్ణజయంతి 66 వ మహోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా పురస్కరించుకొని సోమవారం గ్రామంలో మురళీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 3 వేల మంది అన్నసమారాదనలో పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. మురళీకృష్ణ యువజనసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వెంకటరమణ సేవా చారిటీ ఆసుపత్రి వ్యవస్థాపక అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజు బహుమతులు అందించారు. మరో 10 మంది పేద విద్యార్థులకు నగదు సాయం చేశారు.

ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి



టీటీడీ బోర్డు సభ్యుడు శేషబాబును శేష వస్త్రాలతో సత్కరిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓలు

పాలకొల్లు సెంట్రల్/పాలకొల్లు అర్బన్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామిని టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన శేషుబాబు- శశికళ దంపతులను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గణపతి, క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్ధనస్వామి, లక్ష్మీ పార్వతి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రం, ఫొటో, తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం క్షీరారామలింగేశ్వరస్వామికి ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి స్వామివారికి పంచహారతులు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, జోగి వెంకటేశ్వరరావు, జోగి వడ్డికాసులు, పెచ్చెట్టి కోటేశ్వరరావు, మోర్త గిరీష్, గవర బుజ్జి, ఆలయ సిబ్బంది, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భారీ వర్షం



జలమయమైన నరసాపురం రహదారులు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, రాయలం, కొమరాడ, అనాకోడేరు, చినఅమిరం, గొల్లవానితిప్ప, నాగిడిపాలెం, దొంగపిండి, కొత్తపూసలమర్రు, దెయ్యాలతిప్ప తదితర గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో పలువురు ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థులు వర్షంలోనే తడిసి పాఠశాలలకు వెళ్లారు. పల్లపు గ్రామాలైన నాగిడిపాలెం, లోసరి, కొత్తపూసలమర్రు, దొంగపిండి తదితర గ్రామాల్లో శివారు ప్రాంతాల రోడ్లు జలమయమయ్యాయి. వరి చేలకు వర్షం వల్ల తెగులు వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. వర్షం చేపల చెరువులకు మేలు, రొయ్యల చెరువులకు కీడు చేస్తుందని ఆక్వా రైతు పేర్కొంటున్నారు.

నరసాపురంలో కుండపోత వర్షం

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణంలో సోమవారం భారీ వర్షం కురిసింది. కుండపోత వర్షానికి రోడ్లు, డ్రైన్లు, ఏకమయ్యాయి. ఉధృతంగా రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో రోడ్లు కాలువల్లా దర్శనమిచ్చాయి. పట్టణంలోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జనజీవనానికి అంతరాయం కలిగింది. మధ్యాహ్నం వరకు వర్షం పడుతూనే ఉంది. ఈ స్థాయిలో వర్షం కురిసిన సందర్భాలు కొన్నేళ్లుగా లేవని స్థానికులు అన్నారు. మురుగు డ్రెయిన్లు ఉప్పొంగి పోయాయి. భవిష్యత్తులో డ్రెయిన్ల స్థాయిని పెంచుకోవాలని ఈ వర్షం హెచ్చరిక చేసినట్లుగా అనిపించింది. ఇటీవల వర్షాలు లేక వ్యవసాయ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. వాతావరణం చల్లబడి వరి పైరుకు అనువైన పరిస్థితి ఏర్పడటంతో మేలు చేకూరుతుందని రైతులు ఆనందపడుతున్నారు. రొయ్యల చెరువులకు ఆక్సిజన్ లోపం వల్ల కొంత నష్టం చేకూరుతుందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొగల్తూరులో భారీ వర్షం

మొగల్తూరు: వర్షాకాలం ప్రారంభమైన తరువాత మొదటిసారిగా మండలంలో భారీ వర్షం కురిసింది. గత రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు సుమారు 32.2 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. జాతీయ రహదారితో పాటు గ్రామాల్లోని పలు రహదారులు నీటమునిగాయి.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న అమ్మ ట్రస్ట్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో అనాథ మృతదేహానికి సోమవారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఐదు రోజుల క్రితం స్థానిక బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన మృతి చెందిన గుర్తుతెలియని పురుషుని మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు మార్చురీకి తరలించారు. ఈ మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో సమాచారం తెలుసుకున్న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ముందుకు వచ్చి హిందూ సాంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకులు అంబటి సాయి మాట్లాడుతూ ఎవరూ లేని అనాథలకు తమ ట్రస్ట్ తరపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో కూడా ఓ అనాథ మృతదేహానికి, చనిపోయిన గోవుకు అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తోట దుర్గాప్రసాద్, అనంతపల్లి సతీష్, కవురు యశ్వంత్, షేక్ సిద్దిక్ పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ- క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ

యలమంచిలి: రైతులు తాము సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి కోరారు. యలమంచిలిలో ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. యలమంచిలి మండలంలో ఈ సార్వా పంటకు 4,262 మంది రైతులు 5,322 ఎకరాల్లో వరి సాగు చేశారన్నారు. ఇంతవరకు 4,020 ఎకరాలకు సంబంధించి 2,967 రైతులు మాత్రమే ఈ క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకున్నట్లు ఆమె వివరించారు. ఈ క్రాప్ నమోదయ్యాక ఈకేవైసీ ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. పంటల బీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగు మందులు సరఫర, వైఎస్సార్ యంత్ర పరికరం నమోదు, పెట్టుబడి సాయం మంజూరు, ఉచిత బోర్లు మంజూరు వంటి ప్రయోజనాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ నెల 15వ తేదీ లోపు ఈ క్రాప్‌లో తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ-క్రాప్‌లో భాగంగా రైతు భరోసా కేంద్రాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రతి రైతు భూమి, గ్రామం, సర్వే నెంబరు, ఆధార్, పంట వివరం, నాట్లు వేసిన తేదీ వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారని చెప్పారు.

పట్టెంపాలెంలో వరి మాసూళ్లు ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పట్టెంపాలెంలో ఖరీఫ్ వరి మాసూళ్లు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వరి కోతలను ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో ఆర్ఎస్.ప్రసాద్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం 120 రోజుల కాలపరిమితి కలిగిన పీఆర్-126 రకం కోతలు జరుగుతున్నాయని, ఎకరానికి 40 నుంచి 45 బస్తాలు కట్టుపొట్టు వస్తుందన్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు.

నేడు చిలకంపాడులో ఎల్ఎల్ఎం నూతన మందిర ప్రతిష్ట

పెంటపాడు: గూడెం ఎల్ఎల్ఎం విమోచన మందిరం ఆధ్వర్యంలో చిలకంపాడులో నెల 12న నూతన మందిర ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు పాస్టర్ విజయ్‌కుమార్, సిస్టర్ మేరీలు తెలిపారు. ఎల్ఎల్ఎం సంస్థ వ్యవస్థాపకులు, యునైటెడ్ పాస్టర్ల సంఘ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు, సిస్టర్ యోరీ జైలు పాల్గొని నూతన మందిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించబోయే ప్రతిష్ఠ ఆరాధనలో విశ్వాసులు పాల్గొనాలని ఈ సందర్భంగా కోరారు.

మండపాకలో ఫ్యామిలీ ఫిజీషియన్

తణుకు టౌన్: మండలంలోని మండపాక గ్రామంలోని 2వ సచివాలయంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించినట్లు రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బంగారు రవి తెలిపారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన ఈ శిబిరంలో బీపీ, సుగర్ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈనంతరం బీపీ, సుగర్ బాధితులకు, దీర్ఘకాలిక వ్యాధి బాధితులకు అవసరమైన మందులను మందులను అందజేశారు.

స్పందనలో 3 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో మూడు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కందుల వాణి సోమవారం చెప్పారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదుల్ని పరిశీలన నిమిత్తం పంపినట్లు తెలిపారు.

కిరాణా షాపులో చోరీ

సాక్షి, భీమవరం: స్థానిక గునుపూడి నాచువారి సెంటర్‌లో వీరబాలాజీ కిరణా అండ్ జనరల్ స్టోర్స్‌లో రూ.మూడు వేల నగదు, రూ.2,500 విలువైన సిగరెట్లు చోరీకి గురైనట్టు యజమాని మురికిపూడి బాలాజీ తెలిపారు. ఆదివారం రాత్రి షాపు తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్టు బాలాజీ పేర్కొన్నారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

భీమవరం అర్బన్: అదనపు కట్నం తీసుకు రమ్మని వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాగిడిపాలెం గ్రామానికి చెందిన కొల్లాటి జయదుర్గ, శ్రీనివాస్‌లకు 2017లో వివాహమైంది. అప్పట్లో జయదుర్గ తల్లిదండ్రులు శ్రీనివాస్‌కు పసుపు కుంకుమల కింద కొంత సొమ్ము ముట్టజెప్పారు. గత కొంతకాలంగా అదనపుకట్నం తీసుకురమ్మని శ్రీనివాస్ వేధిస్తుండటంతో జయదుర్గ ఫిర్యాదు మేరకు ఏఎస్సై డి.సంజీవ రావు సోమవారం కేసు దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఫిర్యాదుపై కేసు నమోదు

భీమవరం అర్బన్: బంధువులు అన్యాయంగా కొట్టి గాయపరిచారని మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. తుమ్మగొప్పి గ్రామానికి చెందిన బాలం సుజాత తమ బావలయిన బాలం బుజ్జిబాబు, బాలం చినబాబు ఆస్తి తగాదాలో అన్యాయంగా కొట్టి గాయపరిచారని బాలం సుజాత ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు దర్యాప్తు చేపట్టారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పాలకొల్లు అర్బన్: ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ యోజనలో భాగంగా లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సలహాలు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం అందజేశారు. మెడికల్ ఆఫీసర్ డా.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ ఎలిజబెత్, హెల్త్ సూపర్‌వైజర్ అమలేశ్వరరావు, కమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నా మట్టి నాదేశం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బ్రాడీపేట ప్రాంతంలో నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించినట్టు జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు గుడాల ఈశ్వర్ ఈశ్వర్ అన్నారు. ప్రతి గ్రామం నుంచి పవిత్రమైన మట్టిని సేకరించి మండల కేంద్రాల నుంచి ఢిల్లీకి పంపించేందుకు రాష్ట్ర, జిల్లా పార్టీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొల్లి నరసింహమూర్తి, రావూరి సుధ, పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, సెక్రటరీ కొల్లి కొండప్రసాద్, కొణిజేటి గుప్త తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,భీమవరం వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీమతి బోడపాటి దుర్గా లక్ష్మీ తండ్రి బాల వినయ్‌కుమార్ మార్టుగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తి పై ఏ విధమైన అభ్యంతరములు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. వీరవాసరం సబ్‌రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.389/2019 భీమవరంకు చెందిన ఆర్.యస్.నం.160/3 డోర్.నం.4-1-15 లో 228 చ.గ.లకుల [illegible] హద్దులు తూర్పు: భీమవరం-చిన్నర [illegible] రోడ్డు, పడమర: ప్లాట్ నం.212 [illegible] వెంకట రామ సూర్య సత్యనారాయణరాజు ఉత్తరం: ప్లాట్ నం.22 దక్షిణం:ప్లాట్ నం.228
పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490433732

ప్రకటన

నా క్లయింటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,భీమవరం వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీమతి బొడ్డు రత్నకుమారి తండ్రి సత్యనారాయణ మార్టుగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తి పై ఏ విధమైన అభ్యంతరములు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. గునుపూడి సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.922/2011 భీమవరంకు చెందిన ఆర్.యస్.నం.385/7 డోర్.నం.16-12-10 లో 155.69 చ.గ.[illegible] హద్దులు తూర్పు: రాజవీధి, పడమర: ప్రభుత్వ స్థలం, ఉత్తరం: రత్నకుమారి గారి మిగతా స్థలం, దక్షిణం:షేక్ [illegible] సాహెబ్ గారి గృహం
పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490433732